

వర్షపు నీటిని బావిలో నిల్వ చేస్తూ..

వర్షపు నీటిని ఒడిసి పట్టి.. బావిలో నిల్వచేసి



రైతు గవ్వల మల్లేశం

వర్షం కురిసినప్పుడు పంట పొలాల్లోకి చేరిన నీరు సహజంగా పల్లానికి ప్రవహించి వాగుల్లో కలుస్తుంది. లింగాలఘనపురానికి చెందిన రైతు గవ్వల మల్లేశం వర్షపు నీటిని వృథా కానివ్వకుండా ఒడిసి పట్టేందుకు పూనుకున్నారు. తన పంట పొలాల్లోని వర్షపు నీటిని నీరు లేని వ్యవసాయ బావిలోకి పైపుల ద్వారా పంపించి ఇలా నిల్వ చేస్తున్నారు. కొంత నీరు ఇంకిపోయినా, బోరుబావిలో భూగర్భజలం మట్టం పెరుగుతుందని, నిల్వ ఉన్న నీటిని బోరు మోటారు ద్వారా తిరిగి పంట పొలానికి అందిస్తానని వివరించారు.

– న్యూస్‌టుడే, లింగాలఘనపురం

నేటి నుంచి డీఎస్సీ-2008 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2008 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 27 నుంచి అక్టోబర్ 5 వరకు హనుమకొండలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొనసాగుతుందని డీఈవో డి.వాసంతి గురువారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 274 మంది అభ్యర్థులున్నట్లు చెప్పారు. అర్హులైన వారు తమ ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. కాంట్రాక్టు పద్ధతిలో వారిని ఉపాధ్యాయులుగా నియమిస్తామన్నారు. పూర్తి వివరాల కోసం స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి


జనగామ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఇటీవల ప్రకటించిన పలు ఒప్పంద/పొరుగు సేవల కోసం 32 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను జిల్లా ఇన్‌ఛార్జి వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవీందర్‌గౌడ్ గురువారం ప్రకటించారు. కార్యాలయంతో పాటు సంబంధిత వెబ్‌సైట్ వివరాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తమ నిజ ధ్రువపత్రాలతో ఈ నెల 28న మధ్యాహ్నం 2.30 గంటలకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కార్యాలయంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

నలుదిశలా.. ఘనకీర్తి చాటేలా!

● పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో 'ఈనాడు' ప్రత్యేక కార్యక్రమాలు..

● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం..

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి, ఈనాడు వరంగల్



పర్యాటక ప్రాంతాల్లో అపరిశుభ్రత, ప్లాస్టిక్, చెత్తాచెదారం పేరుకుపోతుండటం ప్రకృతి ప్రేమికులకు ఆందోళన కలిగిస్తోంది. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో గురువారం 'ఈనాడు' ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. యువత, వాకర్స్, విద్యార్థులు సహకారంతో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించింది. విద్యార్థులు కట్టడాల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించుకున్నారు. స్వయం క్రమశిక్షణ పాటిస్తూ.. ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి పర్యాటక ప్రాంతాలను కాపాడుకుంటామని ప్రతినబూనారు.

ఈనాడు మీతోడు



ప్రకృతిహితం

ఖిలావరంగల్, వరంగల్ జిల్లా

● **కార్యక్రమం:** పర్యాటక ప్రాంతాలు కాలుష్యమయం కాకుండా ఉండేందుకు ప్రకృతిహితంగా సైకిల్‌పై వెళ్లి సందర్శించడం, సమీపంలో ఉంటే నడక ద్వారా వెళ్లి చూడటం. సైక్లిస్టులు ఉదయం 6 గంటలకు హనుమకొండ కలెక్టరేట్ ముందు సైక్లింగ్ ప్రారంభించి, సుమారు 15 కి.మీ. దూరంలోని వరంగల్ కోటకు చేరుకున్నారు. ఈ ప్రదేశంలో సైకిల్‌పై తిరుగుతూ కీర్తి తోరణాలు, ఖుష్ మహల్ ఇతర ప్రదేశాలను సందర్శించారు. అనంతరం వాకర్స్‌తో కలిసి రాతి గోడ వరకు నడుస్తూ పర్యాటక ప్రాంతాల్లో రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం కట్టడికి చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు.

● **పాల్గొన్న వారు:** ట్రైసిటీ రైడర్స్ వరంగల్ అసోసియేషన్ సభ్యులు జయరాజ్, విద్యాసాగర్, ప్రసాద్, రవికుమార్, వెంకటేశ్వర్లు, సదాశివరెడ్డి, డాక్టర్ ప్రదీప్‌కుమార్, సైక్లిస్టులు, ఖిలావరంగల్‌లోని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు 60 మంది

● **సందేశం:** కాలుష్యం బారి నుంచి పర్యాటక ప్రాంతాలకు విముక్తి



అవగాహన

ఇనుగుర్తిలోని కాకతీయుల శిలా శాసనాలు: మహబూబాబాద్ ● కాకతీయులు నిర్మించిన శాసనాలను తెలియజేస్తూ విద్యార్థులకు అవగాహన ● జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎ.యాకయ్య, బి.దేవేందర్ ● భావితరాలకు కాకతీయుల శిలా శాసనాలను అందించాలి. - ఇనుగుర్తి (కేసముద్రం)



శ్రమదానం

కాళేశ్వరం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ● కాళేశ్వరం హరిత హోటల్ సమీపంలో పిచ్చిమొక్కలు తొలగించడం ● హరితా సిబ్బంది, మేనేజర్ జక్కం సురేష్ ● శ్రమదానం చేద్దాం. . పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం..– కాళేశ్వరం





చైతన్యం

శ్రీ వేంకటేశ్వర స్వామి సమేత పద్మావతి, అలివేలుమంగమ్మ ఆలయం మహబూబాద్ జిల్లా ● ఆలయ పరిశుభ్రతపై ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవగాహన ● ఆదర్శ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె. శేఖర్, ఎస్సై మాలోతు సురేష్, ఆలయ అర్చకులు నందనాచార్యులు, రాంబాబుచార్యులు, ఎంపీవో యాకయ్య ● ఆలయాలు, పర్యాటక ప్రాంతాలపై అవగాహన అవసరం – నర్సింహులపేట (డోర్నకల్)



స్వచ్ఛత


పాండవుల గుట్టలు రేగొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ● పాండవుల గుట్టల్లో, గుట్టల కింద భాగంలో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు ● గ్రామస్థులు, యువకులు ● పాండవుల గుట్టలను అభివృద్ధి చేస్తే ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారుతుంది. సందర్శనకొచ్చేవారు ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండాలి. – రేగొండ



బాధ్యత

రామప్ప ములుగు జిల్లా ● ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారం తొలగింపు ● పాలంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, స్థానికులు ● రామప్ప పరిసరాలు శుభ్రత సామాజిక బాధ్యత

– వెంకటాపూర్



పరిశుభ్రత

బొగత జలపాతం ములుగు జిల్లా ● పిల్లల పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు, పొదల తొలగింపు ● అటవీ, జలపాతం రక్షణ సిబ్బంది ● స్వచ్ఛత పాటిద్దాం, పచ్చదనం పెంచుదాం, పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యానికి భద్రత – వాజేడు



ప్లాస్టిక్‌పై యుద్ధం

లక్నవరం జలాశయం, ములుగు జిల్లా ● ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ ● బుస్సాపూర్ మాజీ ఉప సర్పంచి బేతి దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పాశం మాధవరెడ్డి, గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది ● పర్యావరణాన్ని రక్షిస్తే మనల్ని మనం కాపాడుకున్నట్లే.. భావితరాలకు బతుకునిచ్చినట్లే. – గోవిందరావుపేట

యోగా శిక్షకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా ఆయుష్ విభాగంలో యోగా శిక్షకుల పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయుష్ విభాగం మల్టీజోన్-1 రీజినల్ డైరెక్టర్ బి.ప్రమీలాదేవి, మెడికల్ అధికారి రాజు, జిల్లా ఆయుష్ ఇన్‌ఛార్జి డా.డి.మమత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు యోగా సర్టిఫికెట్, అనుభవం పత్రాలతో వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆకతాయి బైండోవర్

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: ఆపద సమయంలో సంప్రదించడానికి ఉపయోగించే 100 నంబర్‌కు ఫోన్ చేసి ఆట పట్టించిన ఆకతాయిని తహసీల్దార్ పి.వినయలత ఎదుట గురువారం బైండోవర్ చేసినట్లు ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన దండు లక్ష్మణ్ తనకు ఆపద ఉందంటూ 100కి ఫోన్ చేశాడు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది అంతే వేగంగా స్పందించి ఫోన్ చేసిన ప్రదేశానికి వెళ్లగా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. ఇలా ఏకంగా 13 సార్లు ఆట పట్టించాడు. తాగిన మైకంలో పోలీసుల సమయాన్ని వృథా చేయడమే కాకుండా అత్యవసర సేవల వ్యవస్థకు అనర్థం కలిగించేలా ప్రవర్తించినందుకు బైండోవర్ చేసినట్లు వివరించారు.

కుటుంబం కుల బహిష్కరణ

పాలకుర్తి, న్యూస్‌టుడే: జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని గూడూరులో ఓ కుటుంబం కుల బహిష్కరణకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ రిటైర్డ్ ఉద్యోగి తల్లి 10 రోజుల కిందట మృతి చెందింది. దహన సంస్కారాల అనంతరం ఇతర కార్యక్రమాలకు ఎవరూ ముందుకు రాలేదు. వచ్చేవారిని సైతం కులస్థులు అడ్డుకున్నారు. ఇందుకు భూతగాదాలే కారణమని తెలుస్తోంది. కొందరి ప్రోద్బలంతో కులస్థులు తమను అడ్డుకుంటున్నారని బాధితుడు వాపోయారు. ఈ విషయంపై ఈనెల 22న పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై ఎస్సై సాయి ప్రసన్న కుమార్‌కు వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిందని, విచారణ చేస్తున్నామని సమాధానమిచ్చారు.

చెరువులోనే భవనం..!

వివరాలు 8లో..

ఐలమ్మ పోరాటం చిరస్మరణీయం



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్‌బాషా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జమున, బీసీడీవో రవీందర్ తదితరులు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం చిరస్మరణీయమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్‌బాషా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జమున ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకోవాలని అన్నారు. కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయానికి ఐలమ్మ పేరు పెట్టడం అభినందనీయమని, ఆమె జీవిత చరిత్ర, పోరాట పటిమను పాఠ్యాంశాల్లోనూ చేర్చాలని కోరారు.. కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ. రైతాంగ సాయుధ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిన ఆమె ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, రజక సంఘం నాయకులు మైలారపు వెంకటేశ్వర్లు, ఉల్లెంగుల వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సిమెంట్ కాంక్రీటుతో అందంగా..



వరద తాకిడికి కొట్టుకుపోయిన కింది భాగం

పైన పటారం.. అడుగున లొటారం!

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం భాంజిపేట వాగుపై ఉన్న తక్కువ ఎత్తు వంతెన ఇది. పైకి ఎంతో అందంగా సిమెంటు కాంక్రీటుతో కనిపిస్తోంది. కింది భాగం మొన్నటి భారీ వర్షాలకు ధ్వంసమై ప్రాణాంతకంగా మారింది. సంబంధిత అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులే ముళ్ల కంపలు వేస్తూ ప్రాణాలను కాపాడుకుంటున్నారు. గతంలో ఈ వంతెన ముగ్గురి ప్రాణాలను మింగింది. ఎంతో మందిని ఆసుపత్రుపాలు చేసింది. ఏటా వర్షాకాలంలో ప్రయాణికులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నా తిరిగి లో లెవల్ కల్వర్టునే నిర్మించారు. ఇటీవల వర్షాలకు ఐదు నెలలకే ఓ వైపు కొట్టుకుపోవడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. కన్నాయపల్లి, కోడూరు, కల్వాలపల్లి, లింగం, శ్రీమన్నారాయణపురం, నిడిగొండ, లింగాలఘనపురం మండలం కుందారం, కిష్టాజిగూడెం తదితర గ్రామాలతోపాటు వ్యవసాయ భూములకు వెళ్లాలంటే ఈ కల్వర్టే ఆసరా. రాత్రి వేళ ప్రయాణించే వారికి ఇక్కడ ప్రాణగండం పొంచి ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. – న్యూస్‌టుడే, రఘునాథపల్లి

సోమేశ్వరాలయంలో జిల్లా న్యాయమూర్తి పూజలు



శివలింగానికి పూజలు చేస్తున్న జిల్లా న్యాయమూర్తి రవీంద్ర శర్మ, సురేఖ దంపతులు

పాలకుర్తి, న్యూస్‌టుడే: శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం జిల్లా న్యాయమూర్తి రవీంద్రశర్మ, సురేఖ దంపతులు పూజలు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన దంపతులకు ఆలయ అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. స్వామివారి శేషవస్త్రాలతో వారిని సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఈవో మోహన్‌బాబు, సూపరింటెండెంట్ వెంకటయ్య, అర్చకులు డీవీఆర్.శర్మ, అనిల్‌శర్మ, నాగరాజు, ఎస్సై సాయి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఆరుద్రోత్సవం

పాలకుర్తి: శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆరుద్రోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. 108 లీటర్ల ఆవు పాలతో అర్చకులు స్వామివారికి అభిషేకం చేశారు. గర్భాలయ దీపాలంకరణ, భారీ గజమాలతో విశేష పూజలు, అన్నప్రసాద తీర్థవితరణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. భజన కీర్తనలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి.

'నూరు పదుల మొక్కలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో రాము, తదితరులు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కుందూరు సుధాకర్ రచించిన 'నూరు పదుల మొక్కలు' పుస్తకాన్ని జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము గురువారం కార్యాలయంలో ఆవిష్కరించారు. తాను పనిచేసిన ప్రతి పాఠశాలలో, నివాసం ఉంటున్న పరిసర ప్రాంతాల్లో వెయ్యి మొక్కలు నాటి పరిరక్షించడం అభినందనీయమని డీఈవో అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ నరసింహారావు, డీసీఈబీ సహాయ కార్యదర్శి రామరాజు, ఉపేందర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి

దేవరుప్పుల రూరల్: విద్యార్థులను చదువుతో పాటు అన్నిరంగాల్లో తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం కామారెడ్డిగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై తెలుసుకున్నారు. ఎంఈవో కళావతి, ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రకుమార్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో ఏబీవీ డిగ్రీ విద్యార్థిని ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపల్ నర్సయ్య

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: ఇటీవల స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా గౌహతిలో నిర్వహించిన ఆర్‌ఈసీ ఓపెన్ టాలెంట్ హంట్ యూత్ బాక్సింగ్ పోటీల్లో జనగామలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని కె.అంజలి కాంస్య పతకాన్ని సాధించారని ప్రిన్సిపల్ డా.ఏ.నర్సయ్య గురువారం తెలిపారు. బీ.ఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఆర్.సాయిప్రణతి 45-48 కిలోల విభాగంలో, కె.అంజలి 60-65 కిలోల విభాగంలో పాల్గొనగా అంజలి కాంస్య పతకాన్ని సాధించినట్లు తెలిపారు. అక్టోబరు 6 నుంచి 13వ తేదీ వరకు హరియాణాలోని రోహ్‌తక్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ ఆనంద్ భాస్కర్‌రాజు తెలిపారు.


నేడు భవిష్యనిధిపై అవగాహన సదస్సులు

కాజీపేట, న్యూస్‌టుడే: భవిష్యనిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని అన్ని జిల్లా కేంద్రాల్లో శుక్రవారం అవగాహన సదస్సులు, గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు వరంగల్ ప్రాంతీయ కమిషనర్ ఎస్.దానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ ప్రతిమ క్యాన్సర్ ఆసుపత్రిలో, హనుమకొండ రాంపూర్‌లోని తిరుమల హెచరీస్‌లో, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మున్సిపాలిటీ, జనగాం సెయింట్ మేరిస్ హైస్కూల్, జయశంకర్ భూపాలపల్లి ఎస్ఆర్ డీజీ స్కూల్, ములుగు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. భవిష్యనిధి ఖాతాదారులు, ఉద్యోగులు తమ సమస్యలను విన్నవించుకుని వెంటనే పరిష్కారం పొందవచ్చని సూచించారు.

డిగ్రీ పరీక్ష రుసుం గడువు అక్టోబర్ 5

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో నవంబరులో జరగనున్న డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ (రెగ్యులర్, బ్యాక్ లాగ్) సెమిస్టర్ పరీక్ష రుసుం నోటిఫికేషన్‌ను పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.నరసింహచారి, అదనపు అధికారి తిరుమలదేవి గురువారం విడుదల చేశారు. అపరాధ రుసుం లేకుండా అక్టోబర్ 5 వరకు, అపరాధ రుసుం రూ.50తో 15 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.kakatiya.ac.in లో చూడాలని సూచించారు.

చెరువులోనే భవనం..!



● ధర్మసాగర్ జలాశయంలో ఏడాదిగా పనులు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములు కబ్జాకు గురవుతుండగా, తాజాగా నిర్మాణాలు ప్రారంభించారు.

ఈనాడు, వరంగల్, ధర్మసాగర్, న్యూస్‌టుడే

రాజధాని హైదరాబాద్‌లోని చెరువు శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు కనిపిస్తే 'హైడ్రా' కూల్చేస్తోంది. కొత్తగా వెలుస్తున్న నిర్మాణాలపై కొరడా ఝుళిపిస్తోంది. మన దగ్గర ఏకంగా జలాశయంలోనే భవనం నిర్మిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

దేవాదుల ఎత్తిపోతల పథకానికి గుండెకాయ లాంటి ధర్మసాగర్ జలాశయం గ్రేటర్ వరంగల్ ప్రజల తాగునీటికి ప్రధాన వనరు. ఈ చెరువు శిఖంలోనే ఒక భవనాన్ని కట్టేశారు. ధర్మసాగర్ నుంచి ముప్పారం దారిలో ఉన్న జలాశయం శిఖం భూమిలో ప్రైవేటు వ్యక్తి ఇంటి నిర్మాణాన్ని ఏడాది కాలంగా చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎవరూ అడ్డుకోకపోవడం గమనార్హం.

పట్టాభూమైనా అనుమతి లేదు

అనేక గ్రామాల పరిధిలో చెరువు శిఖం భూముల్లో రైతులకు పట్టా భూములు ఉంటాయి. చెరువులో నీళ్లు లేనప్పుడు పంటలు వేసుకుంటారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎలాంటి నిర్మాణాలకు అనుమతి లేదు. ధర్మసాగర్ చెరువు శిఖంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. పట్టాగల భూమి జలాశయంలో ముంపునకు గురికాలేదని, వ్యవసాయ భూమిని 'నాలా' (వ్యవసాయేతర) భూమిగా మార్పిడి చేసుకున్నట్టు సమాచారం. మరో విడ్డూరం ఏంటంటే 'నాలా' కన్వర్షన్ తీసుకున్నది ఒక చోట కాగా.. ఇంటి నిర్మాణం జరిగింది మరో ప్రాంతంలో అని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని సమాచారం.

స్థానిక తహసీల్దార్ ఏమన్నారంటే..


ఇది పట్టా భూమి అని, ముంపునకు గురికాలేదని ఆధారాలను చూపించి, ఇందులో ఎలాంటి అభ్యంతరాలు లేవని, ఒకవేళ ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని సంబంధిత రైతు డిక్లరేషన్ ఇస్తే నాలా కన్వర్షన్ చేశామని చెప్పారు..

● సంబంధిత యజమానిని 'ఈనాడు' ఫోన్‌లో వివరణ కోరగా ఈ భూమిని రైతు నుంచే కొనుగోలు చేశానని ..శిఖంలో లేదని తెలిపారు.

నోటీసులు జారీ

సాగునీటి పారుదల శాఖ అధికారులు ఇది అక్రమ నిర్మాణమే అని రెవెన్యూ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని అటు అధికారులకు, ఇటు ఇంటి యజమానికి నోటీసులు జారీ చేశారు. ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో సర్వే నెంబర్ 1251లో ఇంటి నిర్మాణం జరుగుతుండగా తమకు గత ఏప్రిల్‌లో సమాచారం రాగా వెళ్లి పరిశీలించామని డీఈఈ ప్రశాంతి తెలిపారు. సంబంధిత యజమానికి నోటీసు ఇచ్చామని చెప్పారు. ఎఫ్‌టీఎల్‌లో లేదని, పట్టా భూమిగా చెబుతున్నారన్నారని.. దీనిపై పూర్తి నిర్ధారణ కోసం రెవెన్యూ, నీటిపారుదల శాఖ కలిసి సర్వే చేయడానికి తహసీల్దార్‌కు ఉత్తరం రాశామని అన్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు.

● ఇంటి నిర్మాణానికి అనుమతి లేదని, కూల్చివేయమని మండల పరిషత్ అభివృద్ధి అధికారికి కూడా లేఖ రాశామని పేర్కొన్నారు.



వరంగల్ బస్టాండ్ భవన సముదాయం (పాతచిత్రం)



కూల్చి వేసిన అనంతరం ఇలా..

ఉన్నది కూల్చారు.. నిర్మాణం మరిచారు!

రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌కు ప్రస్తుతానికి ఆర్టీసీ బస్టాండ్ లేదు. ఓరుగల్లు రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో రెండున్నర ఎకరాల్లో ఉన్న పాత బస్టాండ్ భవన సముదాయాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో గతేడాది జూన్‌లో అప్పటి మంత్రి కేటీఆర్ రూ.73.50 కోట్ల అంచనాతో కొత్త ప్రయాణ ప్రాంగణ నిర్మాణానికి ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. అనంతరం పాత బస్టాండ్ నేలమట్టం చేశారు. ఏడాదిన్నర గడుస్తున్నా.. పనులు ప్రారంభించడం లేదు. పక్కనే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్‌లో ప్రయాణికులు ఎండావానల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే గిర్మాజీపేట

ఎన్‌సీసీ జాతీయ శిక్షణకు ఎంపిక



సాయిచందన్

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల (కోఎడ్యుకేషన్) బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థి, ఎన్‌సీసీ క్యాడెట్ బి.సాయిచందన్ జాతీయ శిక్షణకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ ఎన్.రమణ తెలిపారు. సెప్టెంబర్ 26 గురువారం నుంచి అక్టోబర్ 6 వరకు బెంగళూరులో 20 మందికి ట్రెక్ కంట్రోలర్ ఇన్ ఏరో మోడలింగ్ డిజైన్‌లో శిక్షణ పొందుతారని పేర్కొన్నారు. శిక్షణకు బయలుదేరిన సాయిచందన్‌ను రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి రాధిక, ఎన్‌సీసీ అధికారి అనిల్‌కుమార్ తదితరులు అభినందించారు.

శాస్త్రీయ పద్ధతుల్లో నేరాల దర్యాప్తు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే నేరాల దర్యాప్తు శాస్త్రీయ పద్ధతుల్లో చేయాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఠాణాల వారీగా కేసుల నమోదు, విచారణ, నిందితుల అరెస్టు, కేసుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి, డీజీపీ కార్యాలయం నుంచి వచ్చే బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, రౌడీ షీటర్లపై నిఘా పెంచాలని, గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను వెంటనే అరెస్టు చేయాలని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రమాదాల నివారణలపై చర్చించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, రవీందర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా.. వంతెన పిల్లర్





ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మహబూబాబాద్ - ఇల్లెందు ప్రధాన రహదారిలో బయ్యారం శివారులోగల పాకాలవాగు వంతెనలోని ఓ పిల్లర్ వద్ద భారీగా మట్టి కోతకు గురైంది. పిల్లర్ చుట్టూ సుమారు 8 అడుగుల లోతు గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. వంతెన దిగువ భాగానికి వెళ్లిన రైతులు పిల్లర్ వద్ద ఏర్పడిన గొయ్యిని చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ఆర్‌అండ్‌బీ ఏఈఈ అనిల్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పిల్లర్ వద్ద గొయ్యి పడిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పరిశీలించి వంతెన జాతీయ రహదారి పరిధిలో ఉన్నందున సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వనున్నామన్నారు.

- న్యూస్‌టుడే, బయ్యారం (మహబూబాబాద్)

పర్యావరణ ప్రేమికుడి ఒంటరి పోరాటం

'ఆయన ఒకసారి జాతిపిత గాంధీజీ వేషం వేస్తారు. మరోసారి మెడలో ప్లాస్టిక్ సీసాల దండలు వేసుకొని కనిపిస్తారు. ఇంకోసారి జెండా పట్టుకొని పాద యాత్ర చేస్తూ దారి వెంట వెళ్లేవారందరినీ పలకరిస్తుంటారు. పర్యావరణ పరిరక్షణ కోసమే ఆయన తపనంతా.'



చెట్లను కాపాడాలని, ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని, చెరువులను కాలుష్య కాసారాలుగా చేయొద్దని ఒంటరి పోరాటం చేస్తున్నారు హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన కొలిపాక ప్రకాశ్. వృత్తి రీత్యా ప్రయివేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నా.. ప్రవృత్తి మాత్రం పర్యావరణ పరిరక్షణే. అందుకే ఎక్కడ పర్యావరణ వినాశనం జరుగుతోందని తెలిసినా వెంటనే పాదయాత్రగా బయలుదేరి వెళ్లి దాన్ని ఆపాలంటూ గళమెత్తుతారు. -ఈనాడు, వరంగల్

చెరువుల్లోని వ్యర్థాలను ఏరివేస్తూ..

ప్రకృతిని కాపాడాలి.. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ వాట్సప్ స్టేటస్‌లు పెట్టడమే కాదు.. ఫేస్‌బుక్‌లో పోస్టులు చేసేవారు చాలా మంది.. ప్రకాశ్ అలా కాదు.. మనం ఆచరించాకే ఇతరులకు చెప్పాలంటారు. ఇటీవల గణేశ్ నిమజ్జనం అయ్యాక ఓరుగల్లులోని చెరువుల వద్దకు వెళ్లారు. ఒక్కో చెరువులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి గట్టుపై కుప్పలుగా పోశారు. వాటిని తీసుకెళ్లాలని బల్దియా సిబ్బందిని కోరారు. వరంగల్ చిన్నవడ్డేపల్లి చెరువు, హనుమకొండ పద్మాక్షి గుండం, కాజీపేట బంధం చెరువుల వద్దకు వెళ్లి తనకు అందినంత మేర ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.



ఇటీవల నిమజ్జనం తర్వాత చెరువుల్లోని చెత్తను ఏరివేస్తూ..

అలా మొదలు..

ప్రకాశ్ 10వ తరగతి వరకు ములుగు జిల్లా మంగపేటలో చదువుకున్నారు. ఆ సమయంలో బిల్ట్ పరిశ్రమ నుంచి కాలుష్యం బాగా వెలువడడంతో బిల్ట్ యాజమాన్యం అప్పుడప్పుడు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటేది. పాఠశాల స్థాయిలో ఆ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. పెద్దయ్యాక అటవీ అధికారి పురుషోత్తంతో పరిచయం అయ్యాక పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన పెరిగింది.

● ఈ పర్యావరణ ప్రేమికుడు ప్రతి రెండేళ్లకోసారి మేడారం మహా జాతరకు పాదయాత్రగా వెళతారు. జాతరలో ప్లాస్టిక్‌ను నిర్మూలించి ప్రకృతిని కాపాడాలనే సందేశం ఇస్తూ నాలుగు రోజుల పాటు వనదేవతల వద్దకు నడక సాగిస్తారు. గత ఫిబ్రవరిలో జరిగిన జాతరకు వినూత్నంగా జాతిపిత గాంధీజీ వేషం ధరించి దారి వెంట కనిపించిన వారిని పలకరిస్తూ పర్యావరణాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందంటూ సందేశం ఇచ్చారు. పాఠశాల పిల్లలకు అవగాహన కల్పిస్తూ ప్రయాణం సాగిస్తారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా మెడలో ప్లాస్టిక్ సీసాలు ధరించి ప్లాస్టిక్ నిర్మూలనపై వైవిధ్యంగా అవగాహన కల్పించారు.

ఒక్కో అడుగు..

● 2018లో ఖైరతాబాద్ మహా గణేశుడి విగ్రహం కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగించడంపై పర్యావరణ హితంగా విగ్రహాన్ని రూపొందించాలని పాదయాత్రగా వెళ్లి అక్కడి నిర్వాహకులను, కాలుష్య నియంత్రణ అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు.

● వికారాబాద్ వద్ద జాతీయ రహదారి నిర్మాణం కోసం వెయ్యి మర్రిచెట్లను నరికేస్తారని తెలిసి ఓరుగల్లు నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేశారు. అంతేకాకుండా 'హైదరాబాద్ నేచర్ లవర్స్' సంస్థతో కలిసి చెన్నైలోని జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో ఆ ఉత్తర్వుపై వ్యాజ్యం వేశారు. అనంతరం ఆవి ఫిర్యాదు చేయడంతో గ్రీన్ ట్రైబ్యునల్ స్పందించి చెట్ల నరికివేతపై స్టే ఇచ్చిందంటారు. ప్రకాశ్ కృషి కూడా ఎంతో ఉంది.

● ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలో దామగుండంలో రాడార్ కేంద్రం ఏర్పాటుపై పర్యావరణ ప్రేమికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న క్రమంలో త్వరలో అక్కడికి పాదయాత్రగా వెళ్లి తన గళాన్ని వినిపిస్తానని చెబుతున్నారు.



ప్రమాదాన్ని మరిచి.. చరవాణిలో నిమగ్నమై



ఇలా చూస్తుంటే అటో.. ఇటో



ఇలా రాజాలా కూర్చుంటే అంతే..

మిత్రమా.. రెప్పపాటులో చేజారుతుంది జీవితం!

రైలు నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోతున్నవారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. నిత్యం ఏదో ఒకచోట అలాంటి హృదయవిదారక దృశ్యాలు వెలుగుచూస్తున్నాయి. అయినా చాలా మంది ప్రయాణికులు రైలు లోపల నిల్చోవడానికి స్థలం ఉన్నా తలుపు వద్ద కూర్చుని ప్రయాణం చేస్తున్నారు. అక్కడ ఏ ఆధారం లేకుండా ప్రమాదకరంగా నిల్చుంటారు. చరవాణిలో మాట్లాడుతుంటారు. ఇది రైల్వే చట్టాల ప్రకారం నేరం. రూ.300 జరిమానా లేదా ఏడు రోజుల జైలు శిక్ష ఉంటుంది.

ఇదీ పరిస్థితి..

గురువారం సాయంత్రం 5 గంటలకు వడ్డెపల్లి చెరువు వద్ద సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లు ఇంటర్‌సిటీని పరిశీలించినప్పుడు ప్రతి కోచ్‌లోనూ ప్రతి తలుపు వద్ద కూర్చుని ఉన్న ప్రయాణికులు కనిపించారు. వడ్డెపల్లి చెరువు వద్ద రైలు గంటకు 30 కి.మీ. వేగంతో ప్రయాణం చేస్తుండగా 'న్యూస్‌టుడే' తీసిన చిత్రాలు ఇవి..

–న్యూస్‌టుడే, కాజీపేట

కాజీపేట, వరంగల్ జీఆర్‌పీ పోలీసు స్టేషన్ పరిధిలో తలుపు వద్ద కూర్చుని జారి పడి మరణించిన వారి సంఖ్య

సంవత్సరం	సంఖ్య
2021	13
2022	10
2023	18
2024	12

పదేళ్లలో జరగని అభివృద్ధి.. ఏడాదిలో చేసి చూపిస్తా..



స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో పదేళ్లలో జరగని అభివృద్ధిని ఏడాది కాలంలో చేసి చూపిస్తానని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గడిచిన పదేళ్లలో నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధి చెందలేదని ఆరోపించారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో తనపై నమ్మకం ఉంచి తనను, తన కుమార్తెను గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం ఎప్పటికీ తీర్చలేనిదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మాటలే కాకుండా దానికి సంబంధించిన ఎజెండాను ప్రకటిస్తున్నట్లుగా వివరించారు. ఈ నెల 24న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అనేక అభివృద్ధి విషయాలపై గంటకు పైగా చర్చించానని చెప్పారు. నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి, సమీకృత భవనాల నిర్మాణం, మొదటి దశలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలలతో పాటుగా మున్సిపాలిటీకి సంబంధించిన జీవో, డిగ్రీ కళాశాల ఏర్పాటు, దేవాదుల కాల్వల మరమ్మతులు.. తదితర అభివృద్ధి పనుల గురించి వివరించగా ముఖ్యమంత్రి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ అభివృద్ధి పనులకు అక్టోబరు చివరి వారంలో ఉత్తర్వులు వస్తాయన్నారు. వెంటనే పనులకు టెండర్లు పిలిచి.. నవంబరు 15 లోపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్టేషన్‌ఘన్‌పూర్‌కు తీసుకొచ్చి వేలమంది ప్రజల సమక్షంలో శంకుస్థాపన చేసి.. అదే రోజే ఘన్‌పూర్ మున్సిపాలిటీని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రకటించిన అభివృద్ధి పనులను 2026 జూన్ వరకు పూర్తిచేసి ప్రజలకు అంకితం చేస్తామని వెల్లడించారు. గాంధీ భవన్, ఏఐసీసీ చుట్టూ తిరిగేవారికి పదవులు రావని.. ప్రజల్లో ఉంటూ వారితో మమేకమై.. సమస్యలు పరిష్కరించేవారికే వస్తాయని కడియం శ్రీహరి మార్క్‌గా.. దానిని ఘన్‌పూర్‌లో అమలు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, నాయకులు పొట్లపల్లి శ్రీధర్ రావు, బెలిదె వెంకన్న, చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, మంచాల ఎల్లయ్య, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొంటాం

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కోడానికి కాంగ్రెస్ పార్టీ పక్షాన తాము సిద్ధంగా ఉన్నామని.. వాటి గురించి తాము ఆందోళన చెందడం లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ బలంగా ఉందని చెప్పారు. తనకు ప్రజాస్వామ్యం, కోర్టులు, ఎన్నికల వ్యవస్థ పట్ల పూర్తి నమ్మకం ఉందని అన్నారు.. పదేళ్లలో 38 మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్న నీచ చరిత్ర కలిగిన భారాస ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల మీద మాట్లాడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేయొద్దని.. ఈ జిల్లాకు ఉన్న చరిత్ర, గొప్పతనాన్ని నాశనం చేయకూడదని ఎంత మొత్తుకున్నా తన మాట వినలేదని.. ఆ విషయంలో నేను ఎదరు తిరిగాను కాబట్టే రెండోసారి నాకు మంత్రి పదవి రాలేదని అన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి జూడో పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్‌ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన 68వ రాష్ట్రస్థాయి జూడో పోటీలు గురువారం ముగిశాయి. వరంగల్ నగరంలోని పోచమ్మమైదాన్ సమీపంలోని కెమిస్ట్రీ భవన్‌లో అండర్-14 విభాగంలో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో వరంగల్ జిల్లా ఛాంపియన్‌షిప్ సాధించింది. రెండోస్థానంలో కరీంనగర్ నిలిచింది. బాలుర విభాగంలో కరీంనగర్ జిల్లా ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకోగా.. రన్నరప్‌గా వరంగల్ జిల్లా నిలిచింది. విజేతలకు ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ పతకాలు, ధ్రువపత్రాలు అందించారు. ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి దస్రునాయక్, వ్యాయామ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కోచ్‌లు సంతోష్, కుమార్, రాజు, కిషన్, బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు.. కేసులు నమోదు



వరంగల్‌లో ఔషధాలు పరిశీలిస్తున్న అధికారులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: తెలంగాణ వైద్యమండలి అధికారులు, వరంగల్ యాంటిక్వాకరీ బృందం గురువారం వరంగల్, హనుమకొండ జిల్లాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అర్హత లేకున్నా.. వైద్యం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. తెలంగాణ వైద్యమండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ ఛైర్మన్ డా.నరేష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. వరంగల్ యాంటిక్వాకరీ బృందం, ఐఎంఏ, హెచ్‌ఆర్‌డీఏ జిల్లా సభ్యులు డా.వద్దిరాజు రాకేష్, డా.అన్వర్‌మియా, డా.వెంకటస్వామి, డా.అజిత్‌పాషాలు హనుమకొండలోని భీమారం, దీన్‌దయాళ్ కాలనీ, వరంగల్‌లోని రామన్నపేటలో తనిఖీలు చేశారు. పలువురు ఇష్టారాజ్యంగా యాంటిబయాటిక్ ఔషధాలు, నొప్పి నివారణ సూదులు(ఇంజక్షన్లు) ఇస్తున్నట్లు గుర్తించారు. వందల సంఖ్యలో స్టెరాయిడ్స్, యాంటిబయాటిక్ ఔషధాలు, సూదులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు అర్హత లేని వైద్యులపై ఎన్‌ఎంసీ 34, 54 యాక్టు ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు డా.నరేష్‌కుమార్ తెలిపారు. పారామెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకొని వైద్యులు కాకున్నా.. పరిధి దాటి వైద్యం చేస్తున్న మహేందర్, జ్ఞానేశ్వర్‌లపై చర్యలు తీసుకోవాలని బోర్డుకు సిఫార్సు చేయనున్నట్లు వివరించారు.

నర్సంపేట: నర్సంపేటలోని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లను వైద్యాధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. లింగ నిర్ధారణ పరీక్షల యాక్టుకు లోబడి పరీక్షలు చేస్తున్నారా? లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ యంత్రాలు, రోగుల వివరాల పుస్తకాలతో పాటు ఇతర రికార్డులు పరిశీలించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

తూము శిథిలం.. వృథాగా జలం



జఫర్‌గఢ్ పెద్ద చెరువు తూము శిథిలమై నీళ్లు వృథాగా పోతున్న విషయం రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో కురిసిన భారీ వర్షానికి చెరువులోకి దాదాపుగా 13 అడుగుల నీళ్లు చేరాయి. వరి సాగుకు అడుగు దాటడంతో తూము ద్వారా నీళ్లను విడుదల చేయలేదు. కొద్ది రోజుల నుంచి తూము ద్వారా నీళ్లు లీకై వృథాగా వెళ్తున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంతో ఇప్పటికే మూడు అడుగుల నీళ్లు వృథాగా పోయాయని రైతులు చెప్పారు. ఉన్న పది అడుగుల నీటితో కూడా యాసంగిలో పంటలు పండించుకోలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం గురించి ఐబీ ఈఈ సుధీర్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తూము లీకేజీ గురించి ఏఈలకు చెప్పి మరమ్మతులు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, జఫర్‌గఢ్

పోరాట యోధుడు సర్వాయి పాపన్న



వెంకిర్యాలలో విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్, న్యూస్‌టుడే: బహుజనుల రాజ్యాధికారంతోనే బడుగులు బాగుపడతాయనే సిద్ధాంతంతో అన్ని వర్గాలను ఏకం చేసి పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకిర్యాలలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాన్య కుటుంబంలో పుట్టి వేలాది మంది యువకులను సైన్యంగా తీర్చిదిద్ది రాష్ట్ర వ్యాప్తంగా కోటలు, రాజ్యాలను సాధించిన వీరుడని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంగౌడ్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తుది శ్వాస వరకు పోరాడిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేత శివరాజ్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జమున, భాజపా నేతలు బీరప్ప, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిద్ధులు, బూరెడ్డి ప్రమోద్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులు రామరాజు, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండగకు ఏర్పాట్లు

జనగామ టౌన్: పట్టణంలోని బతుకమ్మ కుంట మైదానంలో బతుకమ్మ, దసరా ఉత్సవాల కోసం ఏర్పాట్లను మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఉదయం నడకలో భాగంగా పట్టణ ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. పండగ ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులకు సూచనలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ అనిత, నాయకులు రామేశ్వరాచారి, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
స్టేషన్‌ఘన్‌పూర్: 80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: సాగరంలో మురుగు కాల్వలను శుభ్రం చేయడంలేదు. - పిన్నింటి కృష్ణ, సాగరం.

సమాధానం: సాగరంలో మురుగు కాల్వలను శుభ్రం చేయిస్తాం. - కనకరాజు, పంచాయతీ కార్యదర్శి.

● సాగరంలోని పోచమ్మ ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిలో వీధి దీపాలు లేవు. - సాగరం గ్రామస్థులు

సమాధానం: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రతిపాదనలు పంపాం. అనుమతి రాగానే విద్యుత్తు లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. - విశ్వసాహితి, విద్యుత్తు ఏఈ, జఫర్‌గఢ్

చెత్త సేకరణ

జనగామ, న్యూస్‌టుడే: స్థానిక ధర్మకంచ 13 వార్డు పరిధిలో మూడు రోజుల పాటు ఇంటింటి చెత్త సేకరణ నిలిచిపోగా, ఆ ప్రాంత వాసులు సమస్యను మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తెచ్చారు. ప్రజల ఇబ్బందిని మున్సిపల్ పారిశుద్ధ్య అధికారి గోపయ్య దృష్టికి తేగా గురువారం ఇంటింటికి తిరిగి చర్యలు తీసుకున్నారు. ఇకపై క్రమం తప్పకుండా చెత్త తరలింపు జరిగేలా చూస్తామన్నారు.

స్పందనకు వందనం

పాలకుర్తి: మండల కేంద్రం శివారులోని బైపాస్ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఉన్నాయని రాజు అనే వ్యక్తి 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో గురువారం కథనం ప్రచురితం కాగా పాలకుర్తి గ్రామ ప్రత్యేకాధికారి జయంతి స్పందించారు. పంచాయతీ సిబ్బందితో పిచ్చిమొక్కలు తొలగింపజేశారు.

పంచాయతీ సిబ్బంది సేవలు మరువలేనివి



పంచాయతీ సిబ్బందికి మెడికల్ కిట్టును అందజేస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్

పాలకుర్తి, దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: పంచాయతీ సిబ్బంది సేవలు మరువలేనివని జిల్లా అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. గురువారం పాలకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో వైద్య శిబిరానికి హాజరై మాట్లాడారు. సిబ్బందికి గుర్తింపు కార్డులు, శానిటేషన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జయంతి, ఎంపీడీవో రాములు, ఎంపీవో రవీందర్, వైద్యురాలు స్ఫూర్తి స్పందన, రాజగోపాల్ పాల్గొన్నారు. దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ సందర్శించారు.

జనగామ రూరల్: పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది ప్రజలకు బాధ్యతగా సేవలందించాలని జడ్పీ సీఈవో సరిత అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ ఉద్యోగులు, సిబ్బందికి వైద్య పరీక్షలు ఎంపీడీవో సంపత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఆరోగ్య, గుర్తింపు కార్డులు, పారిశుద్ధ్య పరికరాలను అందజేశారు. డీపీవో స్వరూప మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బచ్చన్నపేట: పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎవలేనివని జిల్లా వ్యవసాయాధికారి రామారావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్మికులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట మల్లికార్జున్, మండల వైద్యాధికారి ప్రసన్నకృష్ణ, వైద్యులు సృజన, మానస, శరత్, పాల్గొన్నారు.

నర్మెట్ట: మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీడీవో అరవింద్ చౌదరి ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్ వైద్య శిబిరాన్ని సందర్శించి సిబ్బంది సూచనలు తెలిపారు. అనంతరం ఎంపీడీవో పంచాయతీ సిబ్బందికి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు భాస్కర్, రమాదేవి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



చిల్పూర్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూర్: ఘన్‌పూర్, చిల్పూర్ మండలాల్లోని పారిశుద్ధ్య కార్మికులకు మండల పరిషత్తు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డీపీవో స్వరూప, ఎంపీడీవోలు విజయశ్రీ, శంకర్ నాయక్, ఎంపీవోలు మాధుసూదన్, నర్సింగం పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: పరిసరాలను పరిశుభ్రం చేసే క్రమంలో పారిశుద్ధ్య కార్మికులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జఫర్‌గఢ్ సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి రాజమౌళి అన్నారు. ఆసుపత్రిలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కూనూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి రాజమౌళి, సీహెచ్‌సీ వైద్యాధికారులు శోభ, శశికళ, రజని, ఇందిర, ప్రమీల, చందర్, సుక్కమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

రఘునాథపల్లి: తాగు నీటిని అందించడంలో పంచాయతీ సిబ్బంది పాత్రే కీలకమని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.సరిత అన్నారు. శిబిరాన్ని సందర్శించారు. మిషన్ భగీరథ జిల్లా కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో వెంకటేశ్వర్లు, ఏఈ అబ్దుల్ హనన్, మండల వైద్యాధికారి కమల్‌హాసన్, పంచాయతీ కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

లింగాలఘనపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 87 మంది సఫాయిలు, పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పంచాయతీ సిబ్బందికి గుర్తింపు కార్డుల పంపిణీ, తపాలా శాఖ నుంచి జీవన్‌మిత్ర బీమా పథకం కార్డులను అందజేశారు.

ప్రజా పోరాటాలకు స్ఫూర్తి ఐలమ్మ జీవితం



పాలకుర్తిలో ..



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ...



నర్మెట్టలో ..

పాలకుర్తి, జనగామ, న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధపోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించారు. రాజీవ్‌చౌరస్తాలో ఆమె విగ్రహానికి సీపీఎం, రజక సంఘాల నేతలు, ఐలమ్మ కుటుంబసభ్యులు, కాంగ్రెస్, భారాస, భాజపా నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. చిట్యాల శ్వేత, నాయకులు కుమారస్వామి, రాంమోహన్‌రెడ్డి, నవీన్, నాగిరెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు వేణు కుమార్, రాకేష్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలేశారు.

● ప్రజా ఉద్యమాలకు చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు బుచ్చిరెడ్డి, ఇందిర, అనిత తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో



రఘునాథపల్లి మండలం శ్రీమన్నారాయణపురంలో



లింగాలఘనపురంలో..



స్టేషన్‌ఘన్‌పూర్‌లో ..



జఫర్‌గఢ్‌లో..



కడవెండిలో ..



కొడకండ్లలో..

'పేదలను విస్మరించిన భాజపా ప్రభుత్వం'



నీర్మాలలో జెండా ఆవిష్కరిస్తున్న కనకారెడ్డి

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ఆరోపించారు. గురువారం నీర్మాలలో గ్రామశాఖ ఆధ్వర్యంలో మహాసభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. నిరంతరం సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం నీర్మాల గ్రామ పార్టీ కార్యదర్శిగా ఇంటి వెంకట్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రమేష్, యాదవరెడ్డి, భిక్షపతి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

రఘునాథపలి, న్యూస్‌టుడే: జాఫర్‌గూడెం ప్రాథమిక పాఠశాలలో గురువారం స్థానిక ప్రధానోపాధ్యాయుడు శాగ కైలాసం విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు చేయూతనివ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీల, అనురాధ పాల్గొన్నారు.

కస్తూర్బా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్, న్యూస్‌టుడే: కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్ అన్నారు. గురువారం జనగామలోని ధర్మకంచ, మండలంలోని చౌడారం, కేజీబీవీ, మోడల్ పాఠశాలలు, మరిగడి, గానుగుపహాడ్, వెంకిర్యాల పాఠశాలలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య, నేతలు గణేశ్, ఎం.కనకయ్య, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో కార్యదర్శుల నిరసన



ఎంపీవో రవీందర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పాలకుర్తి, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శులు గురువారం జిల్లావ్యాప్తంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. పాలకుర్తిలోని మండల పరిషత్ కార్యాలయంలో నల్గొండ జిల్లాలో ఎంపీడీవో, కార్యదర్శుల సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని సంఘం మండల అధ్యక్షుడు యగేందర్ డిమాండ్ చేశారు. కార్యదర్శులు ఎంపీవో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనూష, కిషోర్, శ్రీకాంత్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూర్: స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూర్ మండలాల పంచాయతీ కార్యదర్శులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

రఘునాథపల్లి: పంచాయతీల కార్యదర్శులు నిరసన తెలిపారు. కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో రఘునాథపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన జరిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కిరణ్, సంపత్, సంతోశ్, పూజిత తదితరులు పాల్గొన్నారు.

లింగాలఘనపురం: మండల పరిషత్తు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సీతారాంనాయక్, వీరస్వామి, పంచాయతీ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

తరిగొప్పుల: తరిగొప్పుల ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం పంచాయతీ కార్యదర్శులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. టీపీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్ ప్రసంగించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: మండల పంచాయతీ కార్యదర్శి సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో వెంకటమల్లికార్జున్‌కు సమస్యలపై వినతిపత్రం అందించారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు నర్సింహాచారి ప్రసంగించారు. కార్యదర్శులు రాజశేఖర్, అనిల్‌రాజు, శ్రీనివాసచార్యులు, బానుచందర్, రూపచైతన్య, సౌజన్య పాల్గొన్నారు.

దేవరుప్పుల రూరల్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించిన ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యదర్శులు జిలుకర వెంకన్న, మధుకర్, సంధ్య, స్వప్న, దినేష్, యాకన్న తదితరులు పాల్గొన్నారు

'ఆస్పత్రులపై ప్రభుత్వం నిర్లక్ష్యం'



మల్కాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

చిల్పూర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఆసుపత్రులపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. మల్కాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన త్రిసభ్య కమిటీ ఆస్పత్రుల సందర్శనలో భాగంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో వసతులను, వైద్య పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మారపాక రవి, మనోజ్ రెడ్డి, ప్రవీణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: పేదలు, కార్మికుల సమస్యల పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు అండగా ఉంటూనే పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు అన్నారు. జఫర్‌గఢ్ గ్రామ శాఖ పార్టీ మహాసభ నల్లతీగల శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు చందు నాయక్ ,పార్టీ మండల కార్యదర్శి సోమయ్య, నాయకులు సుధాకర్, వడ్లకొండ సుధాకర్ పాల్గొన్నారు. జఫర్‌గఢ్ సీపీఎం గ్రామ శాఖ నూతన కమిటీ ఎన్నికలు గురువారం నిర్వహించారు. కార్యదర్శిగా కాట సుధాకర్, కార్యదర్శులుగా సాకి నర్సింగం, బంగారు చిరంజీవి, తాటికాయల రేణుక, శోభ, సభ్యులుగా శకుంతల, భారతమ్మ, లక్ష్మీ, కొమురయ్య, కోమల, సోమయ్య సుధాకర్, హాలీం, శ్రీను, భిక్షపతి, నారాయణ, సమ్మమ్మ, వెంకటేశం పాల్గొన్నారు.

వీధులు పరిశుభ్రం



తహసీల్దార్ కార్యాలయ కూడలిలో పరిశుభ్రం చేస్తున్న అధికారులు

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా లింగాలఘనపురంలో వీధులు పరిశుభ్రం చేశారు. మండల పరిషత్తు అధికారి జలందర్‌రెడ్డి, ఎంపీవో రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది పిచ్చి మొక్కలను తొలగించారు. చెత్తా చెదారం ఊడ్చి వీధులను పరిశుభ్రం చేశారు.

రోడ్డుకు మరమ్మతు



మట్టితో మరమ్మతు చేసిన రోడ్డు

స్పందనకు వందనం

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: జనగామ నుంచి పాలకుర్తి వెళ్లే ప్రధాన రహదారిలో పటేలుగూడెం వాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద వేసిన తాత్కాలిక రోడ్డుపై గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఈ సమస్యపై 'ప్రమాదకరంగా తాత్కాలిక రోడ్డు' శీర్షికన ఈ నెల 18న ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు గుత్తేదారును పురమాయించి మట్టి పోయించారు. రోడ్డురోలర్‌తో చదును చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో వాహనదారులు ఈనాడుకు కృతజ్ఞతలు తెలిపారు.

భద్రాచలంలో చీటూరు భక్తుల భజనలు



చీటూరు భజన బృందం

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: శ్రీరాముడి జన్మనక్షత్రం పునర్వసును పురస్కరించుకుని గురువారం భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో భజనలు చేసినట్లు లింగాలఘనపురం మండలం చీటూరు జై హనుమాన్ భజన బృందం అధ్యక్షుడు రావికంటి మోహన్‌రెడ్డి తెలిపారు. తన బృందంలోని 18 మంది సభ్యులతో భద్రాచలం పుర వీధులలో గణపతి భజనతో ప్రదర్శన, సీతారామచంద్రస్వామి ఆలయం చుట్టూ భజనలతో ప్రదక్షణ చేసినట్లు వివరించారు. దేవస్థానం ఈవో చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నామన్నారు. తమ బృందానికి అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు సిద్దేశ్వర్, జిల్లా ప్రతినిధులు పులి ఆంజనేయులు, గందె లక్ష్మయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

ధర్నాకు తరలిన పాడి రైతులు



లింగాలఘనపురం, న్యూస్‌టుడే: పాల బిల్లుల బకాయిలను వెంటనే చెల్లించాలని పాడి ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు కొత్త సుధాకర్ రెడ్డి, అందెం రాంరెడ్డి డిమాండ్ చేశారు. లీటరు పాలకు రూ.5 ప్రోత్సాహకం ఇవ్వాలని, బకాయిపడిన పాత ప్రోత్సాహకాలు చెల్లించాలని, రాయితీపై దాణా, మందులు, పశుగ్రాసం విత్తనాలు, కట్టర్ మిషన్ అందించాలని, పశువులకు, రైతుకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని, పశువైద్య శాలల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలనే డిమాండ్లతో హైదరాబాద్‌లో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద చేపట్టిన ధర్నాకు తరలి వెళ్లారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

జనగామ, న్యూస్‌టుడే: కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాల ఉపాధ్యాయులకు సమాన పనికి సమానం వేతనం చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని పలు పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మయ్య, మండల బాధ్యులు ఎం.గణేశ్, ఎం.కనకయ్య కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు కొమ్మూరి పరామర్శ

జనగామ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ఇతర వర్గాలకు చెందిన పలువురు ఇటీవల మృతి చెందారు. గురువారం బాధితుల కుటుంబ సభ్యులను డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. సీపీఎం నాయకుడు బొట్ల శ్రీనివాస్ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను కలిసి సంతాపం ప్రకటించారు. పెంబర్తికి చెందిన దుర్గాచలం, జనగామ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మచ్చ బాలనర్సయ్య, పార్టీ సీనియర్ నాయకుడు రిజ్వాన్‌లు మాతృమూర్తులను కోల్పోగా కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ కార్యవర్గం ఎన్నిక

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ ఐకాస జిల్లా కన్వీనర్‌గా లాల్మనాయక్, కోకన్వీనర్‌గా ఎస్.సత్తయ్య ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన ఎన్నిక సమావేశం అనంతరం వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఈర్యా, బీకోజీ, మధు, నాగేందర్, దస్రు తదితరులు పాల్గొన్నారు.

సత్యపాల్‌రెడ్డి ఆశయాలను సాధిద్దాం



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సంక్షిప్తంగా

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గబ్బెట సత్యపాల్‌రెడ్డి పోరాటం వీరోచితమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి అన్నారు. గురువారం ఆయన వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆదిసాయన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజారెడ్డి మాట్లాడుతూ రైతాంగ సాయుధ పోరాటంలో పేద ప్రజల పక్షాన నిలబడ్డారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుగుణమ్మ, శ్రీనివాస్, జనార్దన్, సోమయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సిబ్బంది శ్రమదానం

జనగామ టౌన్, న్యూస్‌టుడే: స్వచ్ఛ హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది గీతాశ్రమం దేవాలయ పరిసర ప్రాంతాల్లో శ్రమదానం నిర్వహించారు. పిచ్చి మొక్కలను తొలగించారు. బ్యాంకు మేనేజర్ సుద్దాల జయప్రకాష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. సామాజిక చైతన్యంతో స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు.

వృద్ధులను కుటుంబ సభ్యులుగా చూసుకోవాలి

జనగామ రూరల్, న్యూస్‌టుడే: వయో వృద్ధులను తమ సొంత కుటుంబసభ్యులుగా సేవలు అందించాలని సీడీపీవో రమాదేవి అన్నారు. జనగామ మండలం శామీర్‌పేట పరిధిలోని రుద్రమాదేవి వృద్ధాశ్రమంలో గురువారం వయో వృద్ధుల దినోత్సవాన్ని అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాదేవి మాట్లాడుతూ.. వృద్ధులకు తోచిన పనులు చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాజు, సిబ్బంది లక్ష్మీప్రసన్న, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎంఈవో రాజేందర్‌కు సన్మానం

జనగామ రూరల్, న్యూస్‌టుడే: జనగామ మండల విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన వంగాల రాజేందర్‌ను గురువారం పీఆర్‌టీయూ నేతలు సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్తు అందిస్తాం



విద్యుత్తు నియంత్రికను ప్రారంభిస్తున్న ఏడీఈ వేణుగోపాల్

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్తును అందిస్తామని జనగామ కరెంటు ఏడీఈ వేణుగోపాల్ అన్నారు. గురువారం బచ్చన్నపేట మండల కేంద్రంతోపాటు, కేసిరెడ్డిపల్లి, పోచన్నపేట, ఆలీంపూర్, కట్కూర్ గ్రామాల్లో నియంత్రికలను ప్రారంభించారు. మండలంలోని 10 విద్యుత్తు కొత్త నియంత్రికలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ రాజుకుమార్, సబ్ ఇంజనీర్ అజయ్, విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.